www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 12 ఫిబ్రవరి 2023

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్

కోనసీమ

## ప్రమాదకరంగా రక్షణ గోడ

**ప్రజాశక్తి-మండపేట**

మండలంలోని మారేడు బాక గ్రామం నుంచి కాలనీలకు వెళ్లే సిసి రోడ్డులోని మురికికాలువ వంతెన ఒక వైపు రక్షణ గోడ కూలిపోవడంతోపాటు రెండవ వైపు ఉన్న రక్షణ గోడా కూలిపోయేందు సిద్ధంగా ఉండటం ప్రమాదాలను తలపిస్తోంది. రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



మారేడుబాకలో కూలిన వంతెన రక్షణ గోడ

# 'సదరం' కోసం పడిగాపులు

**తాత్కాలిక సర్టిఫికెట్లతో సరిపెడుతున్న వైద్యులు**

**ఇబ్బందులు పడుతున్న వికలాంగులు**

**సమస్యల పరిష్కారానికి వినతి**

**ప్రజాశక్తి -అమలాపురం**

సదరం సర్టిఫికెట్ల కోసం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వికలాంగులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా కేంద్రమైన అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పాటు పి.గన్నవరం రాజోలు ముమ్మిడివరం కొత్తపేట రామచంద్రపురం మండపేట పట్టణాల్లో ప్రాంతీయ ఆసుపత్రి, సామాజిక ఆసుపత్రిలో సదరం సర్టిఫికెట్ల కోసం రోజుల తరబడి పడిగాపులు కాస్తున్న కూడ వికలాంగులను వైద్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. వైద్య పరీక్షలు ఎక్సరే ఖరీదైన స్కానింగ్ వంటి పరీక్షలు చేసి కూడా అనేకసార్లు తిప్పుతున్నారని సర్టిఫికెట్ మాత్రం ఇవ్వడం లేదని వికలాంగులు వాపోతున్నారు. సదరం సర్టిఫికెట్ ఇస్తే పెన్షన్ వస్తదని జిల్లాలోని సుధీర ప్రాంతాల నుంచి అనేకమంది వికలాంగులు ఏరియా ఆసుపత్రి వద్దకు పడిగాపులు కాస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యశాఖ అధికారులపై చర్యలు తీసుకుని వికలాంగులందరికీ సకాలంలో సదరం సర్టిఫికెట్లు ఇప్పించాలని పలు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డాక్టర్ ఆసుపత్రి సిబ్బంది సమయానికి అందుబాటులో లేరని ఉదయం 9 గంటల నుంచి పడుగాపులు కాస్తున్న వికలాంగుల్ని ఎవర్ను పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మరికొన్ని సందర్భాల్లో సదరం సర్టిఫికెట్ల కోసం అమలాపురం ఏరియా ఆసుపత్రి నుంచి కాకినాడ జనరల్ హాస్పిటల్ కి పంపిస్తూ ఏవేవో సర్టిఫికెట్ల కోసం తిప్పుతున్నారని వారు ఆరోపించారు. అక్కడికి వెళ్లి సర్టిఫికెట్లు తెచ్చినప్పటికీ ఏరియా ఆసుపత్రిలో సదరం సర్టిఫికెట్లు మంజూరు చేయడం కోసం అనేక సార్లు తిప్పుతూ ఉన్నారని వికలాంగులు వాపోయారు. తక్షణం సదరం సర్టిఫికెట్ లో జరుగుతున్నటువంటి అవినీతినీ అరికట్టాలని వికలాంగులను నిర్లక్ష్యంగా పదేపదే హాస్పిటల్ చుట్టూ తిప్పుతున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని వికలాంగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.




అమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం సర్టిఫికెట్ కొరకు వేచి ఉన్న వికలాంగులు(ఫైల్ ఫొటో)

వికలాంగుల సమస్యలు పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలో భాగంగా కరెంట్ బిల్లు 300 యూనిట్లు దాటితే పెన్షన్ ఆగిపోతుందని వికలాంగులకు ఈ నిబంధన మినహాయించాలని వరకు వాడుతున్నారు. పెన్షన్ రూ.3000 ఏమాత్రం సరిపోవటం లేదని వద్ధాప్య పెన్షన్ పెంచిన విధంగానే వికలాంగు పెన్షన్ కూడా రూ.6000 చేయాలని వారు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు.

### వైద్య పరీక్షల పేరుతో రూ.వేలు ఖర్చు

సదరం సర్టిఫికెట్ కొరకు ఆస్పత్రికి వచ్చే బాధితులకు డాక్టర్లు వివిధ పరీక్షల రూపంలో రూ.వేలు ఖర్చు చేస్తున్నారు. వికలాంగులకు డాక్టర్లు వివిధ రకాల స్కానింగ్ పరీక్షల కోసం ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకు పంపించడం వారు రూ. వేలు దోచుకుంటున్నారు. తీర స్కానింగ్ రిపోర్ట్ వచ్చాక సదరం సర్టిఫికెట్ తాత్కాలికంగా రెండేళ్లు మూడేళ్లకు ఇవ్వడం అది పెన్షన్‌కు పని చేయకపోవడంతో పాటు పథకాలకు పనికి రాకపోవడంతో లబ్ధిదారులు లబోదిబో అంటున్నారు. సదరం సర్టిఫికెట్ స్లాట్ బుకింగ్ కొరకు సమస్యలు ఎదురవుతున్నాయని సర్వర్ పనిచేయడం లేదని వికలాంగులు వాపోతున్నారు.

### త్వరితగతిన సదరం సర్టిఫికెట్లు జారీ చేయాలి



వికలాంగులు సుదూర ప్రాంతాల నుంచి సదరం సర్టిఫికెట్ కోసం ప్రభుత్వ ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నారు. కొన్ని సందర్భాల్లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. కనీసం ఫోన్లో సంప్రదించినా వారు సమాధానం చెప్పడం లేదు. వికలాంగులను ఎక్కువసార్లు ఆస్పత్రి తిప్పకుండా వెంటనే వైద్యం నిర్వహించి సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరుతున్నాం.

**-కారెం వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కన్వీనర్, అమలాపురం**

### వికలాంగులను ప్రభుత్వం ఆదుకోవాలి



వికలాంగులకు మా సంస్థ తరపున మా వంతు సాయం దాతలు సహకారంతో చేస్తున్నాము. ప్రభుత్వం కూడా వికలాంగులను ఆదుకోవాలి. రాష్ట్ర వైసిపి నాయకులు, వికలాంగుల గౌరవ అధ్యక్షులు వంటెద్దు వెంకన్న నాయుడు, పినిపే ఫాలోవర్స్, కువైట్ ఎన్నారై గ్రూపు అధినేత మోకా సువర్ణ రాజు తదితరుల సాయంతో వికలాంగుల సమస్యలపై పోరాడుతున్నాము.

**-నాగవరపు పరశురాముడు, వికలాంగ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు, అమలాపురం**

# గురుకులంలో సమస్యల పరిష్కారానికి డిమాండ్

**ప్రజా, విద్యార్థి సంఘాల ధర్నా**

**విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం**

**ప్రజాశక్తి -అమలాపురం**

అల్లవరం మండలం గోడి సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల్లో సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ప్రజా విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈనెల 4న గోడి బాలుర గురుకుల పాఠశాల్లో ఆరవ తరగతి చదువుతున్న మోర్త సోహిత్ రాజవర్ధన్ దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కోలేక పల్లంకుర్రు గొల్ల గురువు గ్రామంలో తన స్వగృహంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం గోడి బాలుర గురుకుల పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజా విద్యార్థి సంఘాలు నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థి తండ్రి శ్రీహరి మాట్లాడుతూ తన కుమారుడు రాజవర్ధన్ గురుకుల పాఠశాల్లో ఉండగానే అనారోగ్యానికి గురవడంతో ఇంటికి తీసుకువెళ్లానన్నారు. గురుకుల పాఠశాల్లో కనీసం తాగడానికి పూర్తిస్థాయిలో మంచినీళ్లు నాణ్యమైన ఆహారం లేకపోవడం పారిశుద్ధ్యం లోపించడంతో విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంలో ఇంటికి తీసుకు వెళ్లిన తన కుమారుడు తనను మళ్లీ గురుకుల పాఠశాలకు తీసుకువెళతానని చెప్పడంతో అక్కడ నెలకొని ఉన్న సమస్యలు, ఇతర విద్యార్థుల వేధింపులు తట్టుకోలేనని భయంతో ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. నా కుమారుడు చనిపోయాడని పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులకు తెలియపరిచిన గాని ఘటన జరిగి వారం రోజులవుతున్న ఇప్పటివరకు తన కుటుంబాన్ని ఎవరు పరామర్శ చేయలేదన్నారు. తన కుమారుడు మరణానికి గురుకుల పాఠశాలలో నెలకొని ఉన్న సమస్యలు మాత్రమే కారణమని ఇలాంటి ఘటనలు వేరే విద్యార్థికి జరగకూడదని అందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కోట హనుమంతరావు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి ఈ గురుకుల పాఠశాలను సమస్యలు వేధిస్తున్నాయని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన రాలేదన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న నాయకులు

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు మాట్లాడుతూ వేలాది మంది పేద విద్యార్థులు చదువుతున్న గురుకుల పాఠశాలలకు సౌకర్యాలు కల్పించడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, దానికి ఉదాహరణ గోడి గురుకుల పాఠశాల నిదర్శనమని అన్నారు. ఆక్వా హేచరీ డ్రైనేజీ వ్యర్థాలు కలుస్తున్న అత్యంత కాలుష్యభరితమైన కాలువ నీరు స్నానానికి ఉపయోగించడం వల్ల విద్యార్థులు అనేక రోగాలను బారిన పడుతున్నారని అన్నారు. మృతి చెందిన రాజ వర్ధన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించిన పక్షంలో విద్యార్థులు తల్లిదండ్రులు విద్యార్థి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఐక్యంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల విద్యార్థి తల్లిదండ్రుల రాష్ట్ర అధ్యక్షుడు పోలమూరు మోహన్ బాబు, ముత్తబత్తుల శ్రీనివాసరావు జంగా శ్రీను, పాలమూరి బాబులు, సాక వెంకటేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, మృతి చెందిన విద్యార్థి బంధువులు పాల్గొన్నారు.

## బాలబాలాజీ ఆదాయం రూ.3.37 లక్షలు

**ప్రజాశక్తి - మామిడికుదురు**

అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయానికి శనివారం వివిధ టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2 లక్షల 23, 774, నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.1లక్షా13, 477 మొత్తం రూ.3 లక్షల 37,271 ఆదాయం సమకూరినట్లు ఆలయం ఇంఛార్జ్ ఎసి ఎం.లక్ష్మీనారాయణ తెలిపారు. 4,275మంది యాత్రికులు స్వామి వారిని దర్శించుకోగా 3,801 మంది అన్న ప్రసాదం స్వీకరించారన్నారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

**ఆత్రేయపురం** ర్యాలీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్నదాన నిర్వహించేందుకు అన్నదానం ట్రస్టుకు శనివారం విశాఖకు చెందిన ఏడిద లక్ష్మీనారాయణ, లక్ష్మీ దుర్గ దంపతులు రూ.7, 500 ఆలయ ఇఒ కృష్ణ చైతన్యకు అందజేశారు.

## 17న 'కపిలేశ్వరపురం' మండల పరిషత్ సమావేశం


**ప్రజాశక్తి -కపిలేశ్వరపురం**

మండల ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశం ఈనెల 17న నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎం. రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన జరిగే సమావేశానికి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. సమావేశంలో పలు అభివద్ధి పనులపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశానికి జెడ్‌పిటిసి సభ్యులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించి పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఎంపిడిఒ కోరారు.

**'మామిడికుదురు' మండలపరిషత్ సమావేశం**

**మామిడికుదురు** మండల పరిషత్ సమావేశం ఈ నెల 17న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కారుపల్లి వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ఎంపిపి కుసుమ వనజ కుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు. పలు అబివృద్ధి పనులపై సమీక్ష జరుగుతుందని మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించి సమాచారంతో హాజరు కావాలన్నారు. జెడ్‌పిటిసి సభ్యులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నియోజవర్గ ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

### కార్టూ'నిజం'









ఆందోళన చేపట్టిన గ్రామస్తులు, (ఇన్‌సెట్)లో పేరుకుపోయిన చెత్త

## శ్మశాన వాటికలో కనీస వసతుల కరువు

**గ్రామస్తుల నిరసన**

**ప్రజాశక్తి-రామచంద్రపురం**

దక్షిణ కాశీగా పేరుగాంచిన ద్రాక్షారామ లో ఎవరైనా మృతిచెందితే వారికి అంతిమ సంస్కారాలు నిర్వహించాలంటే ఒక సాహసమే అవుతోంది. శ్మశానం చెత్తా చెదారం పేరుకు పోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఇక్కడనుండి ఎప్పుడు బయట పడదామా అని బంధువులు ఆలోచించే విధంగా కనీస వసతులు కూడా కరువైన కైలాస భూమి ద్రాక్షారామ లో దర్శన మిస్తోంది.ఇంత అపరిశుభ్రత కలిగిన ఈ కైలాస భూమి గా పిలువబడే శ్మశాన వాటిక ను ఆధునీకరిం చాలని కోరుతూ గ్రామస్తులు శనివారం నిరసన తెలిపారు. శ్మశానవాటిక అభివృద్ధికి న్యాయవాది మాగాపు అమ్మిరాజు నేతృత్వంలో యువత నడుంబిగించింది. దీనితో పాటు ఐక్య వేదిక ఏర్పాటు చేశారు. ప్రభుత్వం, ఇతర వ్యవస్థలపైఆధారపడకుండా దాతలు సహకారంతో అభివృద్ధి చేయడానికి దాతలు విరాళం రూపేనాకాకుండా జ్ఞాపకార్థం కొన్ని పనులు శ్మశానంలో చేయాలని ఫోరమ్ నిర్ణయించింది. కనీస అవసరాలైన విద్యుత్, స్నానాలకు నీరు, నిరంతరం పారిశుద్ధ్యం నిర్వహణ చేయడానికి దహనం చేసేందుకు పొయ్యిలు పుననిర్మాణం, సిసి కెమెరాలు , పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా వంటి పలు అభివద్ధి పనులు చేయడానికి నిర్యయించి నట్లు మాగాపు అమ్మి రాజు తెలిపారు. ఈ కార్యక్రమం లో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బడిబాట పట్టని బాల్యం

**ఆలయాల వద్ద యాచక వృత్తి చేస్తున్న వైనం**

**ప్రజాశక్తి-ఆత్రేయపురం**

14 సంవత్సరాలు వయస్సు గల పిల్లలందరూ బడిలో ఉండాలన్నది అధికారుల లక్ష్యం. కానీ బడిబాట పట్టని బాలలు వందల సంఖ్యలో కనబడుతారు. ప్రముఖ ఆలయాల వద్ద తల్లిదండ్రులే వారిచేత యాచక వత్తి చేయిస్తున్నారు. దీంతో వారికి చదువు మీద ఆసక్తి ఉన్న పాఠశాలకు వెళ్ళలేని దుస్థితి ఏర్పడింది. ఇది నియంత్రించవలసిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. చైల్డ్ హెల్ప్ లైన్1098 కు పలువురు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. వివరాల్లోకి వెళితే మండలంలోని వాడపల్లిలో వెంకటేశ్వర స్వామి ఆలయ పరిసర ప్రాంతాలలో శనివారం తో పాటు పర్వదినాల్లో ఐదు సంవత్సరాల నుంచి 11 సంవత్సరాల వయసుగల బాలబాలికలు ఇక్కడ బిక్షాటన చేస్తుంటారు. వారి తల్లిదండ్రులే వీరిని బిక్షాటన చేయమని ప్రోత్సహిస్తున్నారు. వీరికి ఒక శనివారం రోజునే సగటున రూ.2వేల నుంచి రూ. 3వేల వరకు బిక్షాటనలో వస్తుంటాయి. ఇది నియంత్రించవలసిన చైల్డ్ హెల్ప్ లైన్ అధికారులు కానీ, దేవస్థానం అధికారులు కానీ, పోలీసులు గానీ, రెవెన్యూ అధికారులు కానీ మండల బాల్య నిరోధక చట్టం సంరక్షణ అధికారులు కానీ పట్టించు కోకపోవడం శోచనీయం. గతంలో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో కాకినాడ నుంచి ఒక టీం వచ్చి సుమారు 40 మంది బిక్షాటన చేస్తున్న బాల బాలికలను కాకినాడ తరలించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగజేసుకుని బాలబాలికలను బడిబాట పట్టించి వారి భవిష్యత్తుకు నాంది పలకాలని పలువురు కోరుతున్నారు.



వాడపల్లిలో భిక్షాటన చేస్తున్న బాలిక

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం

వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వెంకటేశ్వర ఆలయం వద్ద యాచక వృత్తి చేస్తున్న బాల బాలికలను గుర్తించి ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టి తీసుకెళతాం. వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి బడిలో చేర్పించే ఏర్పాటు చేస్తాం.

**-పి.వరప్రసాదరావు ఎంఇఒ ఆత్రేయపురం**

## ఇ-క్రాప్ నమోదుతో బహుళ ప్రయోజనాలు

**ప్రజాశక్తి - అంబాజీపేట**

ఇ-క్రాప్ పంట నమోదు వలన రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ జి.వినయ్ చందు అన్నారు. మాచవరం, ముక్కామల గ్రామాలలో శనివారం ఇ క్రాప్ నమోదు పక్రియ ను పరిశీలించారు. పంట నమోదు వివరాలు, విస్తీర్ణం, పంట పేరు, నాటిన తేదీ, పంట రకం, నీటి సాగు పద్ధతి పై రైతులతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారి కాకి నాగేశ్వరరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్‌జెవి.రామ్మోహనరావు, వ్యవసాయ అధికారులు మురళీధర్, సిహెచ్‌డి.విజయ్ కుమార్, విఆర్‌ఒలు సిబ్బంది పాల్గొన్నారు.



పంట నమోదు వివరాలు పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్

**అమలాపురం** అల్లవరం మండలం మొగళ్లమూరు గ్రామంలో జరిగిన రబీ వరి ఇ-పంట నమోదును శనివారం రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ కార్యాలయం అడిషనల్ డైరెక్టర్ వినయ్ చంద్ తనిఖీ చేశారు. జరిగింది. ఇ-పంట నమోదు సక్రమంగా జరిగిందా లేదా అని సూపర్ చెక్ రూపంలో ఏడుగురు రైతుల పేర్లు, సర్వే నంబర్లు, సాగు విస్తీర్ణం, పంట పేరు, నాటిన తేదీ, పంట రకం, నీటి సాగు పద్ధతి మొదలైన వివరాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రైతులకు అందే సంక్షేమ పథకాలను ఇ-పంట పై ఆధారపడి ఉంటాయన్నారు. పంట నష్టం పరిహారం, పంట బీమా, వడ్డీలేని పంట రుణాలు, ధాన్యం కొనుగోలు మొదలగునవి ఇ-పంట ద్వారా అమలు అవుతున్నాయన్నారు. మొగళ్ళమూరు గ్రామంలో తనిఖీ చేసిన రికార్డులు అన్ని సక్రమంగా ఉన్నాయన్నారు. రైతుల నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం జిల్లా వ్యవసాయ అధికారి కాకి నాగేశ్వరరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎంఎ షంషి, వ్యవసాయ అధికారులు మురళీధర్, ఎన్‌వివి.సత్య నారాయణ, విఆర్ఒ చిట్టిబాబు, సర్వేయర్ రోజా, గ్రామ సర్పంచ్ రాయుడు విష్ణు త్రిమూర్తులు, వ్యవసాయ సహాయకులు జల్లి మేఘన, వాలంటీర్లు నరేంద్ర, తాతాజీ, రైతులు చిట్టుమేను నాగేశ్వరరావు, కొల్లు బోజయ్య, కాంద్రేగుల ప్రకాష్ రావు పాల్గొన్నారు.

## 272 మందికి ఉచిత వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి-అంబాజీపేట**

పుల్లేటికుర్రు పంచాయతీలో శనివారం రూరల్ డెవలప్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 272 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ జల్లి బాలరాజు ప్రారంభించారు. ముందుగా ట్రస్ట్ లోగోను సర్పంచ్ ఆవిష్కరించారు. కుష్టు వ్యాధి గ్రస్తులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అమలాపురం కిమ్స్ వైద్య నిపుణులు 272 మందికి జనరల్ వైద్యంతో పాటు చెవి, ముక్కు, గొంతు, డెంటల్, కంటి మరియు ఇసిజి పరీక్షలు నిర్వహించారు. అహ్మద్ హెల్త్ కేర్ అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి డివివి.సత్యనారాయణ, ఎంపిటిసి పబ్బినీడి రాంబాబు, ఉపసర్పంచ్ వీరా స్వామి, మాజీ సర్పంచ్‌లు నూకపెయ్యి చిన్న, బి.రాజారావు, హైస్కూల్ కమిటీ ఛైర్మన్ ఏడుకొండలు, కొత్తపల్లి రామకష్ణ, ట్రస్ట్ ఛైర్మన్ యు.సురేష్, సభ్యులు వి.మూర్తి, యు.ప్రసన్న, ఎమ్.సుధాకర్, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం రూరల్** ఈదరపల్లి చిన్న మంద చర్చి దగ్గర శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎఎస్ఎ ఆస్పత్రి వారి సౌజన్యంతో జనసేన పార్టీ డాక్టర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నాగ మానస, ఛైర్మన్ డాక్టర్ బొడ్డేపల్లి రఘు ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ ఎం.శివ ఆశిష్, షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ గుండాబత్తుల అంజలి, డాక్టర్ జె.జోత్స్న, సీనియర్ గైనకాలజిస్ట్, నగేష్ ఆప్టిమెట్రిస్ట్ (ఐ స్పెషలిస్ట్) లు పాల్గొని బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు డాక్టర్ మానస చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈదరపల్లి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు ఈ వైద్య శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయుడు వరలక్ష్మి,10వ వార్డ్ మెంబర్ పోలిశెట్టి వీరబాబు, ఎంపిటిసి సభ్యుడు అడపా సత్తిబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు లింగోలు పండు, జనసేన నాయకులు రఘుబాబు,పడాల నానాజీ, ఆర్ డి ఎస్ ప్రసాద్, కార్యకర్తలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



పుల్లేటికుర్రులో వైద్యపరీక్షల చేస్తున్న దృశ్యం



ఈదరపల్లిలో కళ్లద్దాలు అందజేస్తున్న డాక్టర్ నాగ మానస




నగదు అందజేస్తున్న పాపారావు దంపతులు

## ఆలయ నిర్మాణానికి రూ .10 లక్షల విరాళం

**ప్రజాశక్తి - ఆలమూరు**

తోగమ్మిలో నిర్మిస్తున్న శివాలయ నిర్మాణానికి పారిశ్రామిక వేత్త, మురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు, సతీమణి కాశీవిశాలాక్షి కుమారి శనివారం రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. వంటిపల్లి పాపారావు సతీమణి కాశీవిశాలాక్షి కుమారి ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం 'తోగమ్మి'లో పుట్టింది. ఆ గ్రామ మాజీ సర్పంచ్ మద్దిపాటి ఆది పట్టాభి రామయ్య, సుబ్బాయమ్మ దంపతుల కుమార్తె కాశీవిశాలాక్షి కుమారి. పుట్టి పెరిగిన గ్రామం మీద మమకారంతో ఆ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయ నిర్మాణానికి ఆలమూరు వచ్చిన ఆ గ్రామస్తులను అభినందించి రూ. 10 లక్షల భారీ విరాళాన్ని అందించి పుట్టిన ఊరు పై మమకారం చాటుకున్నారు. తోగమ్మి గ్రామ వాసులు పాపారావు దంపతులను అభినందించారు. ఈ సందర్భంగా తోగమ్మి గ్రామ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని పాపారావు దంపతులు తెలియజేశారు.



రైతులకు మందులు అందజేస్తున్న దృశ్యం

## పశువులకు వైద్యపరీక్షలు

**ప్రజాశక్తి -రామచంద్రపురం**

రామచంద్రపురం మండలంలోని భీమక్రోసుపాలెంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరంలో 94 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించామని ద్రాక్షారామ పశువైద్యాధికారి ఎం.కృష్ణార్జున తెలియ జేశారు. పులేట్టన్ ఇండియ కంపెనీ సహకారంతో ఈ పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రూ.10వేలు విలువైన మందులను రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పశు సంవర్ధక శాఖ ఎడి ఒ.రామకృష్ణ, వెల్ల పశు వైద్యులు రామచంద్ర రావు, నరసాపురం పేట వైద్యులు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి మాధవరెడ్డి

## చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

అమలాపురం పరిసర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి వివరాలను వెల్లడించారు. అమలాపురం డిఎస్‌పి వై.మాధవరెడ్డి పర్యవేక్షణలో అమలాపురం సిసిఎస్ సిఐ గోవిందరాజులు, అమలాపురం రూరల్ సిఐ పి.వీరబాబు, తాలూకా ఎస్ఐ ఎ.వరదేశి, సిబ్బంది కలిసి తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో బట్నవిల్లి గ్రామానికి చెందిన కన్నెపాముల శివశంకర్ నాగ దుర్గాప్రసాద్, ఇళ్ళ సతీష్, కన్నెపాముల నాగప్రసాద్ లు అమలాపురం మండలం సమనసగరువు గ్రామం మేధా గార్డెన్స్ ఇంటి దొంగతనం చేసిన కేసును పోలీసులు ఛేదించారన్నారు. నిందితులు చెడు వ్యసనాలకు అలవాటు పడి ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్నారని అన్నారు. వారి వద్ద నుంచి రూ. 3 లక్షల 49 వేలు విలువచేసే వస్తువులను రూ.లక్షా 48 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు. ఈ కేసును ఛేదించిన అమలాపురం సిసిఎస్ పోలీస్, అమలాపురం రూరల్ సిఐ, అమలాపురం తాలూకా ఎస్ఐ, సిబ్బంది, క్లూస్ టీమ్‌లను జిల్లా ఎస్‌పి అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో యాచకురాలు మృతి

ప్రజాశక్తి -రాజానగరం

రోడ్డు ప్రమాదంలో యాచకురాలు మృతి చెందింది. దివాన్ చెరువు జాతీయ రహదారి గైట్ కళాశాల దగ్గర సుమారు 60 సంవత్సరాల వయస్సు ఉన్న యాచకురాలిని కంటైనర్ లారీ ఢీ కొంది. దీనితో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. మతురాలి పూర్తి వివరాలు తెలియాలని సమాచారం తెలిసిన వారు సెల్ నెంబర్ 9440796533, 9866063391 కాల్ చేయాలన్నారు. దీనిపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-గోకవరం

అశోక్ లైలాండ్ వ్యాను బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గోకవరంలో చోటుచేసుకుంది. గోకవరం పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. గంగవరం మండలం జియం పాలెం గ్రామానికి చెందిన కారం తమన్న దొర తన ఇంటి నుంచి బైక్ తో బయలుదేరి గోకవరం మీదుగా లోతుపాలెం వెళుతున్నాడు. ఈ సమయంలో గోకవరం ఇంద్రమ్మ కాలనీ వద్ద దేవీపట్నం మండలం పుణ్యాల బాద్ నుంచి గోకవరం మీదుగా వస్తున్న దుంపలలోడు అశోక్ లేలాండ్ ప్యాన్ డ్రైవర్ అతివేగంతో బైక్ ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తమన్న దొర అక్కడిక్కడే మృతి చెందాడు. అన్నారు. మృతుని తల్లి కారం లక్ష్మమ్మ గోకవరం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివ నాగబాబు కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి తరలించినట్లు తెలిపారు.

## పంట కాలువలో మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - కాజులూరు

మండలం ఇంజరం పంచాయతీ సిద్ధార్థ నగర్ చర్చి ఎదురుగా పంట కాలువలో మహదేవం లభ్యమైనట్లు కోరంగి ఎస్.ఐ. శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఇంజరం వీఆర్ఓ ఇచ్చిన సమాచారం మేరకు విచారణ చేపట్టగా చని పోయిన వ్యక్తి కాజులూరు మండలం సీతారం గ్రామానికి చెందిన జగదం లోవరాజు (30)గా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

టౌన్ హాల్లో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసే అరెస్టు చేసినట్లు జగ్గంపేట ఎస్ఐ విద్య సాగర్ తెలిపారు. శనివారం జగ్గంపేట గోకవరం రహదారిలో ఉన్న టౌన్ హాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని రూ.17,200 సొమ్మును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి మంగళవారం ఉదయం పెద్దాపురం కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు.

## పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

ప్రజాశక్తి - సామర్లకోట

పిఠాపురం రోడ్డు పెద్ద ఏలేరు కాలువ వద్ద ఉప్పు వారి సత్రం వద్ద మామిడి తోటలో పేకాట ఆడుతున్నారని సమాచారంతో సామర్లకోట సీఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.33,450 స్వాధీనం చేసుకున్నట్లు సామర్లకోట సిఐ దుర్గాప్రసాద్ తెలియజేశారు.

## వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

మిర్తిపాడులో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి బావిలో పడ్డాడు. ఈ సంఘటన పై పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. వివరాలు ఇవి.. మిర్తిపాడు ప్రాంతంలో సిరి నర్సరీ సమీప స్థలంలో గడ్డి మేటు దాని చుట్టూ ప్రహరీ ఉంది. లోపల గోడ పక్కనే బావిలో వ్యక్తి పడ్డాడని స్థానికుల సమాచారం మేరకు వీఆర్ఓ నామాల రత్నకుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సీతానగరం ఎస్ఐ శుభ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బాలిక అదృశ్యంపై..

ప్రజాశక్తి -గోపాలపురం

బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణ శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఈనెల 9న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు పై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# గోదారి గలగలలు

# పరిశ్రమల్లో రక్షణ చర్యలేవీ..

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పారిశ్రామిక చట్టాలకు తూట్లు పొడిచేలా పరిశ్రమలు ఏర్పాటు, నిర్వహణ జరుగుతోందని మరోసారి సుస్పష్టమైంది. పెద్దాపురం మండలం జి.రాగంపేటలో అంబటి ఆయిల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంతో జిల్లా ప్రజలు ఉలిక్కి పడ్డారు. ఉమ్మడి జిల్లాలో ప్రతి 30 రోజులకోసారి ఎక్కడో ఒక చోట ఇటువంటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదం జరిగిన అనంతరం ప్రభుత్వం కంటితుడుపుగా పరిహారం ప్రకటించటం చేతులు దులుపుకోవటం పరిపాటిగా మారింది. రెండునెలల క్రితం తాడేపల్లిగూడెం కడియద్ద వద్ద జరిగిన బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు కారణంగా జిల్లాకు చెందిన పలువురు కార్మికులు మృతి చెందిన విషయం విదితమే. అనంతరం దేవరపల్లిలోనూ ఒక ఫ్యాక్టరీలో ప్రమాదం చోటు చేసుకుని కార్మికులు మృత్యువాత పడ్డారు. గతంలో బైక్ పరిశ్రమలోనూ ఇటువంటి ప్రమాదమే చోటు చేసుకుంది. ప్యారీ షుగర్స్‌లో కేవలం 10 రోజుల వ్యవధిలో రెండు ప్రమాదాలు జరిగాయి. ఫ్యాక్టరీల నిర్వాహకులు కార్మికులకు కనీస రక్షణ పరికరాలు అందించకపోవటం, పని ప్రదేశాలలో జాగ్రత్తలు తీసుకోకపోవటం ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం యథేచ్ఛగా అనుమతులు మంజూరు చేయటం, పరిశ్రమల ఏర్పాటు అనంతరం కనీస పర్యవేక్షణ లేకపోవటమే ఈ దుస్థితికి కారణమని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ప్రమాద నివేదికను వెల్లడించటంతో పాటు భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కార్మికులు, కార్మిక సంఘాలు, ప్రజలు ప్రభుత్వ యంత్రాంగాన్ని డిమాండ్ చేస్తున్నారు.

**కదం తొక్కిన అంగన్‌వాడీలు**


అంగన్‌వాడీ కార్మికుల తమ సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కదం తొక్కారు. అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన గతంలో అనేక సమరశీల పోరాటాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించుకోవటంతో పాటు హక్కులను సాధించుకున్న విషయం విదితమే. అదే స్ఫూర్తితో ఆ యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపుతో ముందుకు కదిలారు. మూడు జిల్లాల కలెక్టరేట్ల వద్ద నిర్వహించిన ధర్నాల్లో వేలాదిగా పాల్గొని ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా కాకినాడలో భారీ ర్యాలీ నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు కార్యాలయం లోనికి కార్మికులు వెళ్లేందుకు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. తమ గోడు విన్నవించుకుంటామని కోరినా అనుమతించలేదు. అంగన్‌వాడీ కార్మికులకు తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతున్నారు. ఇంటర్నెట్ సమస్యల్లున్న ప్రాంతాల్లోనూ ఫేస్ యాప్ పేరుతో ప్రభుత్వం వేధింపులకు పాల్పడుంపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. అదే విధంగా జీవో.1 అమలుతో ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారంలోకి రాక ముందు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఆ హామీలను అమలు చేయలేకపోయారని అంగన్‌వాడీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అమలు చేయకపోతే రాబోయే ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు.

**పాత పెన్షన్ విధానం కోసం ఉపాధ్యాయ సంఘాల దీక్ష**

సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాలు చేపట్టిన సంకల్ప దీక్షకు విశేష మద్దతు లభించింది. జిల్లాలో ఉపాధ్యాయులతో పాటు, ఇతర శాఖల ఉద్యోగులు, ఎంఎల్‌సీలు, ప్రజా సంఘాల నాయకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని తమ మద్దతు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి వారంలోనే సిపిఎస్‌ను రద్దు చేస్తామని ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా వైయస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చిన విషయం విదితమే. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి మూడున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఆ హామీ అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం పూర్తి భిన్నంగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలపై ఉక్కుపాదం మోపుతోంది. పోలీసుల సహకారంతో ఉపాధ్యాయులను ముందస్తు అరెస్టులు చేస్తూ ఉద్యమాన్ని అణచి వేసే కుట్ర చేస్తోంది. ఉపాధ్యాయులు శాంతి యుతంగా తమ ఆందోళనలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేయకుంటే ప్రజా మద్దతు కూడగట్టుకుని తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు.

**కొనసాగుతున్న పేపరు మిల్లు కార్మికుల ఆందోళన**

రాజమహేంద్రవరంలోని ఎపి పేపరు మిల్లులో 8 కార్మిక సంఘాలు ఐక్యంగా చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ ఆందోళనలకు వివిధ కార్మిక సంఘాల నుంచి మద్దతు లభిస్తోంది. కరోనా వైరస్ విజృంభించిన విపత్కర పరిస్థితుల్లోనూ సంస్థను లాభాల బాటలో నడిపించేలక్షి చేసిన కార్మికుల పట్ల యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరిని అఖిల పక్ష పార్టీలు ఖండిస్తున్నాయి. యాజమాన్యం ఇప్పటికైనా కార్మిక సంఘాలతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని సూచిస్తున్నాయి.



పాదగాయ క్షేత్రాన్ని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి శ్యాంసుందర్, పిఠాపురం జడ్జిలు

## పాదగయలో హైకోర్ట్ న్యాయమూర్తి

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని హైకోర్టు జడ్జి జస్టిస్ శ్యాంసుందర్ కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు, న్యాయ మూర్తులు ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో రాజరాజేశ్వరి సమేత కుక్కుటేశ్వర స్వామిని, దత్తాత్రేయ స్వామిని, పవన శక్తిపీఠం పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట పిఠాపురం జడ్జిలు వాసంతి, మాధవి, సుధారాణి ఉన్నారు.

## విగ్రహ ప్రతిష్టలో కళారూపాల ప్రదర్శన

ప్రజాశక్తి - తాళ్లరేవు

పోలేకుర్రు కోదండరామ ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా ప్రదర్శించిన పలు కళారూపాలు ఆకట్టుకు న్నాయి. ఈ సందర్భంగా తప్పెటగుళ్ళు, మహిళల కోలాటం నత్యాలు అలరిం చాయి. ఈ సందర్భంగా పోలేకుర్రు తాళ్లరేవు తదితర ప్రాంతాల నుంచి అప్పన్న ఎద్దులు ఊరేగింపు ఊరేగింపుగా పోలేకుర్రు తరలివచ్చారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వేలాదిమంది ప్రజలు అన్న ప్రసాదాలు స్వీకరించా రు. కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, మాజీ ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు, స్థానిక సర్పంచ్ వెంటపల్లి నూకరాజు పాల్గొన్నారు.


పోలేకుర్రులో తప్పెటగుళ్ళు కళాకారుల ప్రదర్శన

# ఆదిత్యలో కార్పొరేట్ కనెక్ట్ -2023

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలో కార్పొరేట్ కనెక్ట్ -2023 పేరిట వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి అధ్యక్షతన వివిధ కార్పొరేట్ కంపెనీలకు చెందిన మేనేజర్లతో సదస్సు నిర్వహించారు. వివిధ కంపెనీ ప్రతినిధులు ఎక్స్‌పర్ట్ హెచ్.ఆర్ వి.పాన్సుస్వామి, వాచ్.ఆర్. ఎక్స్‌ప్రెస్ కానే ఏలే వాటర్ ప్రై. లి. హెచ్.ఆర్ బి.ఆరుమురం, ప్రొఫెషనల్ విథౌ ఇన్ఫ్రా స్ట్రక్చర్, డిజిఎం హెచ్.ఆర్, రాణి శక్తి జి.వి. హెచ్.ఆర్ సన్నిర ఇస్మాక్ పట్నూరాజా, ఎల్ అండ్ టి హెచ్.ఆర్ పనియప్పన్, నోవా టెక్స్ ప్రై. లి, హెచ్.ఆర్ ఇదయదూరర్, హెచ్.ఆర్ అపెక్స్ సిస్టం భారతి తసన్, హెచ్.ఆర్ ఇంకార్స్ టెక్నాలజీస్ అభినవ జలగోవన్, క్లాసిక్ ఇండస్ట్రీస్, హెచ్.ఆర్ దినేష్, ఎక్స్‌ట్రీ, హెచ్.ఆర్. చార్జెస్ లెనిన్ మయారి అరుణ్ కొన్సిల్టింగ్ సెకాలజిస్ట్, నాగరాజన్ సేల్స్ డైరెక్టర్ గిగిన్ టెక్., పాల్గొన్నారు. ఈ సదస్సులో డాక్టర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ గ్రూప్ ఆఫ్ ఆదిత్య కళాశాలలో ఉద్యోగ నియామకాలు అనేవి నిరంతర ప్రక్రియ అని, దేశంలోని వివిధ కంపెనీలు ఆదిత్యని సందర్శించి విద్యార్థులను ఎంపికొని ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నామన్నారు. అనంతరం కంపెనీ ప్రతినిధులతో విద్యార్థులు ముఖాముఖి కార్యక్రమంలో ప్రస్తుత పారిశ్రామిక అవసరాలు విద్యార్థుల సమా యత్తం కావలసిన అంశాలు పలికారు. ఈ సదస్సులో ఆదిత్య క్యాంపస్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్స్ ఆదిరెడ్డి రమేష్, డోలా సంజయ్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న కంపెనీల ప్రతినిధులు

## 13 నుంచి పెదబ్రహ్మదేవం రైల్వే గేట్ మూసివేత

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం పెద బ్రహ్మదేవం గ్రామంలోని రైల్వే గేట్లు ఈనెల 13వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు మూసివేస్తున్నట్లు సామర్లకోట రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్‌ల మరమ్మతు పనుల కార ణంగా మూడు రోజులపాటు రైల్వేగేట్‌ను మూసి ఉంచుతున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ ప్రజలు గమనించి వారి రాక పోకలకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని, అంత రాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.


మూతపడనున్న పెద దేవం రైలుగేటు


చంద్రబాబు పర్యటన వివరాలను డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథరావుకు అందజేస్తున్న జ్యోతుల నవీన్

## కలెక్టరేట్‌కు చంద్రబాబు పర్యటన వివరాలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 15,16,17 తేదీల్లో జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా అందుకు సంబంధించిన పర్యటన వివరాలను, చంద్రబాబుకి రాకకు ఏర్పాట్లు చేసేందుకు అనుమతి కోరుతూ కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగానికి చెందిన డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథరావుకు వివరాలు రిప్రజెంటేషన్‌ను టీడీపీ కాకినాడ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అందజేశారు.

## శృంగార వల్లభుని ఆదాయం రూ 5.5 లక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తిరుపతిలోని శ్రీ శంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ 4,21,600, అన్నదానం విరాళాల ద్వారా రూ 72,630, కేశ ఖండన ద్వారా రూ 11,200 ఆదాయం సమకూరిందని ఆలయ అధికారి పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికు లకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం సుమారు 10 వేల మందికి మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆలయ అర్చకులు, ప్రజా ప్రతినిధులు కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్,ఆలయ సిబ్బంది కృష్ణ, మోహన్‌రావు, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు, గ్రామ స్తులు, ఆంజనీకుమార్ సేవలందించారన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

## సమాచార వ్యవస్థ గతినే మార్చిన రేడియో

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రపంచ సమాచార వ్యవస్థ గతినే మార్చిన ఘనత రేడియోదేనని కాకినాడ పిఠాపురం రాజాస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.వి.తిరుపాణ్యం అన్నారు. ప్రపంచ రేడియో దినోత్సవ వేడుకలలో భాగంగా రేడియో అల 90.8 ఎఫ్.ఎం, కాకినాడ పిఠాపుర్ రాజాస్ ప్రభుత్వ కళాశాల జర్నలిజం విభాగం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వివిధ పోటీలకు సంబంధించిన గోడ పత్రికను శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేడియోకు వేలాది రూపాలను ప్రేరేపించగల సజనాత్మక శక్తి ఉందన్నారు. రేడియోలో మానవగళం ఉంటుంది కనుక పుస్తకం కన్నా మెరుగయిన భావనాత్మక మాధ్యమంగా రేడియోను చెప్పవచ్చన్నారు. కాలాన్ని, దూరాన్ని జయించే ప్రసార సాధనం రేడియో అన్నారు. కార్యక్రమంలో రేడియో అల 90.8 స్టేషన్ డైరెక్టర్ ఎం.సత్య, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ దడాల శ్రీధర్, కళాశాల పూర్వ విద్యార్ధి సంఘం నాయకులు, వివిధ విభాగాల అధ్యాపకులు, జర్నలిజం విద్యార్థులు పాల్గొన్నారు.


నిత్యావసర వస్తువులు అందజేస్తున్న కోరమండల్ మహిళా సభ్యులు

## నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడరూరల్

రమణయ్యపేట ఏపిఐఐసి కాలనీలో కోరమండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ క్లబ్ అధ్యక్షురాలు వెంకట దుర్గావతి సూచనల మేరకు ప్రతి నెల రెండో శనివారం ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్య క్రమంలో రవికిరణ్ పట్నాయక్, లక్ష్మీ సుజన, అంజుమ్, రేలంగి బాబీరావు, అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

## గాయపడ్డ యువకుని కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి - కాజులూరు

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కోలా శంకర్ కుటుంబానికి గొల్లపాలెం గ్రామానికి చెందిన ఆకుల అయ్యప్ప అతని మిత్రులు చేయూతనిచ్చారు.కోలా శంకర్ కాకినాడలో మోటార్ బైక్ షో రూమ్‌లో పెయింటర్‌గా పని చేస్తున్నాడు. వారం రోజుల క్రితం కాకినాడ నుండి గొల్లపాలెం వస్తుండగా కొంగోడు వద్ద మోటార్ సైకిల్ అదుపుతప్పి పడిపోగా తలకు తీవ్ర గాయం అయింది. సమా చారం తెలుసుకున్న ఆకుల అయ్యప్ప తన మిత్రులకు సమాచారం అందించి సాయం చేయాలని కోరగా రూ.50 వేలు శంకర్ తల్లికి శనివారం అందజేశారు.


శంకర్ తల్లికి అందిస్తున్న అయ్యప్ప

# ఆందోళన చేస్తే క్రిమినల్ చర్యలు తప్పవు

### కానిస్టేబుల్ పరీక్షల అర్హత సాధించలేని విద్యార్థులకు ఎస్‌పి సూచన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్ష వ్రాసి అర్హత సాధించలేని అభ్యర్థులు 5 పర్సెంట్ కట్ ఆఫ్ మార్కులు కలపాలని తలపెట్టిన 'చలో ఆంధ్రప్రదేశ్ సీఎం క్యాంప్ కార్యాలయ ముట్టడి, నిరసనలకు ఎ విధమైన అనుమతులు లేవని, అటువంటి కార్యక్రమాలు చేపట్టడం చట్ట వ్యతిరేకం దీనికి అనుగుణంగా క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవటమని ఎస్‌పి ఎం రవీంద్రనాథ్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా నుండి ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించని విద్యార్థులు గానీ, వారికి మద్దతు తెలిపే అర్హత సాధించని అభ్యర్థులు గాని నిరసన కార్యక్రమాలలో పాల్గొని బంగారు భవిష్యత్తును ఇబ్బందుల్లోకి నెట్టుకోవద్దని ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు హితవు పలికారు. తల్లిదండ్రులు శిక్షణ ఇచ్చే సెంటర్ల నిర్వాహకులు దృష్టి పెట్టి అటువంటి కార్యక్రమాలను మానుకునే విధంగా అభ్యర్థులకు సూచించాలని ఎస్‌పి హితవు పలికారు. కాకినాడ జిల్లా నుండి తలపెట్టిన ఈ ముట్టడి కార్యక్రమానికి ఎవ్వరూ ఎటువంటి అనుమతిలేదని ఎలాంటి అనుమతిచేది లేదని జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్ అధికారులకు తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఇచ్చినట్లుగా ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబు తెలిపారు.


పిల్లలకు వడ్డిస్తున్న దుర్గారావు

## అనాథలకు అన్నదానం

ప్రజాశక్తి - పెదపూడి

స్థానిక మార్స్ కంప్యూటర్స్ అధినేత అడపా దుర్గారావు తల్లి సత్యవతి 6వ వర్ధంతి పురస్కరించుకొని అనాథ ఆశ్రమంలో పిల్లలకు శనివారం అన్నదానం నిర్వ హించారు. తొలుత సత్యవతి చిత్రపటం వద్ద నివాళు లర్పించారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన పుస్తకాలతో పాటు స్వీట్స్, బిస్కెట్లు ప్యాకెట్లు అంద జేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ ఏ డి వి ప్రసాద్, కలకం కిరీటి, గొల్ల నాగేశ్వరరావు, పెద్దేటి కష్ణ, కోరాడ రాజు, తూముకొలను గురవయ్య ఉన్నారు.

## పిఎంపి మృతికి సంతాపం

ప్రజాశక్తి-మండపేట

మండపేటలో పేదల వైద్యునిగా పేరుగాంచిన పిఎంపి ఉప్పలపాటి అచ్చిరాజు (72) శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. సైదుబాబు పేటలో గత 50 సంవత్సరాలుగా పేదలకు వైద్యసేవలు చేసి పేరు ప్రఖ్యాతలు గడించారు. ఆయన మృతికి పిఎంపిలు కె. సత్యనారాయణ, మారిశెట్టి సత్యనారాయణ, బళ్ల వెంకటరమణ, వానపల్లి కనకరాజు తదితరులు సంతాపం తెలిపి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# బెదిరింపుల కేసులో ఒకరు అరెస్ట్

### మరొకరు పరారీ

ప్రజాశక్తి - మండపేట

బ్లాక్‌మెయిలింగ్ కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేయగా ఎ1 గాడు సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నట్లు టౌన్ సిఐ శివ గణేష్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన చింతల వీరప్రసాద్ తన ఇంటిపై మెడికల్ అంతస్తు నిర్మించుకుంటుండగా రౌడీషీటర్ సత్యనారాయణ, ఒక పత్రిక రిపోర్టర్ సయ్యద్ హుస్సేన్ ఫోటోలు తీసి డబ్బులు డిమాండ్ చేశారని తెలిపారు. నిందితులిద్దరూ కలిసి కొంతకాలంగా ఈ దందా సాగిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 1000 వరకు ఆర్‌టిఐ ఫిర్యాదులు చేశారన్నారు. గాదు సత్యనారాయణపై 16 కేసులు, రౌడీషీట్ ఉందని తెలిపారు. త్వరలోనే పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామన్నారు. సమాచార హక్కు చట్టం ఎంతో ఉపయోగకరం, దీన్ని ఇలా బ్లాక్ మెయిలింగ్ కోసం కాక సమాజానికి మంచి చేసేందుకు మాత్రమే వినియోగించాలన్నారు. పరారీలో ఉన్న హుస్సేన్‌ను త్వరలోనే అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరుస్తామన్నారు. బాధితులు నిర్భయంగా 9440796537 ఫోన్ నెంబరులో సంప్రదించాలని సిఐ సూచించారు. ఈ సమావేశంలో టౌన్ ఎస్ఐ ఎ.అశోక్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిఐ